క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

టెక్కలి రూరల్: గూడెం గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం పోతులూరు గ్రామానికి చెందిన యువకుడు తమిరి జ్యోతేశ్వరరావు గాయపడ్డాడు. జ్యోతేశ్వరరావు తన వ్యక్తిగత పనులు నిమిత్తం గూడెం గ్రామం వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంపై నందిగాం వైపు వెళ్తుండగా గూడెం గ్రామం దాటిన తరువాత ఉన్న మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన జ్యోతేశ్వరరావును చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాలుకు గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

వల్లభనారాయణ స్వామికి పూజలు



పూజలందుకున్న వల్లభ నారాయణుడు

మందస: రట్టి గ్రామంలోని వల్లభనారాయణ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. డోలోత్సవాల్లో భాగంగా సోమవారం ఏకాదశి పంచామృత అభిషేకాలు జరిగాయి. 11న విశేష హోమాలు, 12న కామ దాహనం, 13న స్వామి వారి నిజరూప దర్శనం, 14న డోలోత్సవ పూర్ణమి సందర్భంగా సముద్ర స్నానాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు.

పది పరీక్ష కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలి

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి ఉన్నత పాఠశాలకు తొలిసారిగా పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రం మంజూరైన నేపథ్యంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచ్ పిట్ట శశిరేఖ కోరారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళం కలెక్టర్ గ్రీవెన్స్‌లో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఎనిమిది నుంచి పది కిలో మీటర్ల పరిధి కొళిగాం, బిర్లంగి, రత్తకన్న ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలు రాయడానికి వస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. స్థానిక నాయకుడు పిట్ట మామయ్య ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా



దుకాణ యజమానికి జరిమానా విధిస్తున్న అధికారులు

సోంపేట: దుకాణాల్లో ప్లాస్టిక్ వినియోగిస్తే సంబంధిత యజమానులకు జరిమానా విధిస్తామని సోంపేట పంచాయతీ ఈవో శాంతికుమారి అన్నారు. సోంపేట పట్టణంలో సోమవారం ఉదయం ప్లాస్టిక్ వినియోగించవద్దని అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న కొంతమంది దుకాణ యజమానులకు జరిమానా విధించారు. పంచాయతీ సిబ్బంది ఉన్నారు.


విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ



పరీక్ష కిట్లను అందజేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: పాత మేఘవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సుమారు 50 మంది విద్యార్థులకు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు బృందం పరీక్ష కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ.. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయులు పవన్ కుమార్, ప్రఫుల్ కుమార్, దుర్యోధన, రవి, తిరుమలరావు ఉన్నారు.

నాటుసారాను నిర్మూలిద్దాం



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కంచిలి: నాటుసారాను పూర్తిగా నిర్మూలిద్దామని సోంపేట ఎక్సైజ్ సీఐ కె.బేబి అన్నారు. జలంత్రకోట, మఠంసరియాపల్లి గ్రామాల్లో నవోదయం 2.0 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సారా తాగడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. సారా విక్రయం, తయారీ, రవాణా చేసేవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటుమని హెచ్చరించారు.

నిరుద్యోగులకు కుచ్చుటోపీ!

- అమలుకాని నిరుద్యోగ భృతి
- నిరుద్యోగులను వంచించిన కూటమి సర్కార్



స్థానికంగా ఉద్యోగాలు లేక ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన వజ్రపుకొత్తూరు మండల వాసులు (ఫైల్)

వజ్రపుకొత్తూరు: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే వరకు నెలకు రూ.3 వేలు చొప్పున భృతి ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కూటమి సర్కార్ ఆ హామీని అమలు చేయకుండా తాత్సారం చేస్తోంది. గద్దెనెక్కి పది నెలలు కావస్తున్నా ఈ హామీ అమలుపై ఒక్క అడుగూ ముందుకు పడలేదు. నిరుద్యోగులకు భృతి అందించే ప్రతిపాదనే ప్రభుత్వం వద్ద లేదని అసెంబ్లీ సమావేశాలు సాక్షిగా ప్రభుత్వం రాతపూర్వకంగా తేల్చి చెప్పేసింది. పలాస నియోజకవర్గంలో సుమారు 29,800 మంది నిరుద్యోగులు ఉన్నారు. ఇందులో దాదాపు సగం మంది వరకు ఉపాధి కోసం గల్ఫ్, ఇతర దేశాలకు వలస పోయిన వారే. పీజీ, డిగ్రీ, బీఈడీ పూర్తి చేసి కూడా ఉపాధి లేకుండా ఉన్నారు. 2014లో చంద్రబాబు హామీలను నమ్మి మోసపోయినట్లే ఇప్పుడు కూడా నిరుద్యోగులు మరోసారి మోసపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, ఇంటికో ఉద్యోగం, ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, ఐదేళ్లలో మొత్తంగా 20 లక్షల ఉద్యోగాలు, ఉద్యోగం రాకపోతే నిరుద్యోగ భృతి నెలకు రూ.మూడు వేలు చొప్పున ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఇంటింటికీ తిరిగి విస్తృతంగా ప్రచారం చేశారు. 'సూపర్ సిక్స్'పథకాల్లో ప్రధానంగా చూపించారు. గడపగడపకూ తిరిగి కరపత్రాలు పంచిపెట్టి నిరుద్యోగుల్లో విపరీతంగా ఆశలు పెంచారు. ఎన్నికల సమయంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ అనే నిబంధనలు ఏవీ చెప్పకుండా నిరుద్యోగ భృతి ఇస్తామనడంతో అంతా నమ్మారు. కూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా నిరుద్యోగ భృతిపై ఒక్కరూ నోరు మెదపడం లేదు. సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతిపై బడ్జెట్‌లో సైతం ఎటువంటి ప్రకటనా లేదు. కనీసం ఈ పథకం అమలుపై విధి విధానాలు, మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంపై చదువుకున్న యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014లో రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మాట తప్పినట్లుగానే ఇప్పుడు కూడా అదే విధానాన్ని ప్రదర్శించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం భేషరతుగా చదువుకున్న ప్రతి ఒక్కరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలని యువతీ యువకులు డిమాండ్ చేస్తున్నారు.

జాబ్ క్యాలెండర్ ఎక్కడ?

గ్రామీణ ప్రాంతాల్లోని యువత కోచింగ్ సెంటర్లలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి చదువుకుంటున్నారు., కుటుంబాలకు ఆర్థికంగా భారంగా మారినప్పటికీ ప్రభుత్వం ఇచ్చే భృతి అండగా నిలుస్తుందని గంపెడు ఆశలు పెట్టుకున్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తే ఎక్కువ శాతం డిగ్రీ, పీజీ చేసిన యువత విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాల్లో స్టడీ సెంటర్లలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రమాణ స్వీకారం రోజున మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి ఇప్పటి వరకు దాన్ని నిర్వహించకుండా కోచింగ్ సెంటర్లలో మగ్గుతున్న యువతకు చుక్కలు చూపిస్తున్నారు. విశాఖ, గుంటూరు, విజయవాడ తదితర కోచింగ్ సెంటర్లలో నెలల తరబడి కోచింగ్ తీసుకుంటున్నారు. ఐతే ప్రభుత్వం టెట్‌తో సరిపెట్టి ఇప్పటి వరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు.

ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలి



నేను ఎంఎస్సీ, బీఈడీ పూర్తి చేశాను. ఉద్యోగం రాకపోవడంతో ఇంటి వద్దే ఉంటున్నాను.ప్రైవేట కళాశాలల్లో పని చేయాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు కావస్తున్నా నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. కనీసం ఇస్తారో లేదో చెప్పడం లేదు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను పట్టించుకోకపోవడం ఎంత వరకు సమంజసం. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

– బి.ధర్మారావు, నిరుద్యోగి, రెయ్యిపాడు

నిరుద్యోగ భృతి విడుదల చేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. భృతి ఇస్తే ఉద్యోగం వచ్చేంత వరకు ఉపయోగకరంగా ఉంటుంది. మేనిఫెస్టోలో ప్రకటించినట్టుగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించాలి. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

– వంక రాజు, మంచినీళ్లపేట

విద్యార్థుల జీవితాలతో కూటమి చెలగాటం

- ప్రభుత్వ వైఖరిపై మండిపడిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు
- యువత పోరుతో నిలదీద్దామని పిలుపు

కాశీబుగ్గ: కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సీదిరి అప్పలరాజు అన్నారు. కూటమి ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని, మొత్తం రూ.3900 కోట్ల మేరకు బకాయిలు ఉంటే ఈ బడ్జెట్‌లో కేవలం రూ.2600 కోట్లు కేటాయించడం దుర్మార్గమని అన్నారు. ఆయన శ్రీకాకుళం జిల్లా పలాసలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ నెల 12న నిర్వహించనున్న యువత పోరు పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. విద్యార్థుల సంఖ్యను కుదించేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అన్నారు. ఐదు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ పెట్టడం రాక్షసత్వమని అన్నారు. ఫీజులు చెల్లించకపోవడంతో పిల్లలను కాలేజీల నుంచి వెళ్లగొడుతున్నారని అన్నారు. ఉద్దేశ పూర్వకంగానే ప్రభుత్వం బకాయిలు పెడుతోందని, 2014-19 మధ్య కూడా ఇలాగే వైఎస్సార్ పథకాలకు తిలోదకాలు ఇచ్చిందని పేర్కొన్నారు. ఇరవై లక్షల ఉద్యోగాలు, ప్రతినెలా మూడు వేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి ఏమయ్యాయని సూటిగా ప్రశ్నించారు. ప్రజారోగ్యాన్ని బలోపేతం చేసేందుకు వైఎస్సార్‌సీపీ పదిహేడు కొత్త కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుడితే.. మిగిలిన పనులు పూర్తి చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడానికి చూస్తోందన్నారు. 12న అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట విద్యార్థులు, నిరుద్యోగులు, యువతతో కలిసి వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రదర్శన, ధర్నా కార్యక్రమం చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

వ్యక్తికి గాయాలు



గాయపడిన గిరి

టెక్కలి రూరల్: స్థానిక అయ్యప్పనగర్‌లో ఓ ఇంటి నిర్మాణంలో భాగంగా కట్టిన పరంజిపై నిలబడి పెయింటింగ్ వేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. కంద్రవీధికి చెందిన గయా గిరి పరంజిపై నిలబడి ఇంటికి పెయింటింగ్ వేస్తుండగా కర్ర విరిగిపోవడంతో పైనుంచి కిందకు జారి పడిపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన గయా గిరిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు డాక్టర్ మహారాజ్ పరీక్షలు నిర్వహించి నడుము విరిగినట్లు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు.

15న కంచిలి మండల సమావేశం

కంచిలి: కంచిలి మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నందిగాం: ఇరవై ఏళ్లుగా విద్యుత్ సంస్థలో మీటర్ రీడర్లుగా సేవలు అందించిన తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని టెక్కలి సబ్ డివిజన్ విద్యుత్ మీటర్ రీడర్లు కోరారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంస్థకు కరోనా వంటి విపత్కర పరిస్థితిలో కూడా ఇంటింటికీ వెళ్లి రీడింగ్ తీసి ఆదాయాన్ని అందించామని గుర్తు చేశారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్ పేరుతో తమను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు.

పెన్షనర్ల సంక్షేమంపై నిర్లక్ష్యం

టెక్కలి: పెన్షనర్ల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విశ్రాంత ఉద్యోగులు యు.తమ్మయ్య, హెచ్.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కేసిందని మండిపడ్డారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుకూలంగా డీఏలు ఇవ్వడం లేదని, పీఆర్‌సీ చైర్మన్ నియామకం సైతం చేపట్టలేదన్నారు. అన్ని వర్గాలను మోసం చేసినట్లుగా పెన్షనర్లను సైతం కూటమి ప్రభుత్వం మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం మెడలు వంచుదాం

- యువత పోరు పోస్టర్ ఆవిష్కరణలో వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్

టెక్కలి: అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, ఉపాధి అవకాశాలు, ఎటువంటి బకాయిలు లేకుండా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేస్తామని చెప్పి ఈ రోజు పూర్తిగా మోసం చేసిన కూటమి ప్రభుత్వం మెడలు వంచుదామని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. ఈ నెల 12న జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరగనున్న యువత పోరు కార్యక్రమానికి సంబంధించి టెక్కలి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి యువజన విభాగం కార్యకర్తలు, నాయకులతో సోమవారం సమావేశాన్ని నిర్వహించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతీ గ్రామం నుంచి నిరుద్యోగ యువతతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను యువత పోరు కార్యక్రమానికి తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. యువత పోరు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే 12న టెక్కలిలో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ హాజరు కావాలని కోరారు. ఆ రోజు ఉదయం 7.30 గంటలకు టెక్కలి చేరుకోవాలని, పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల అనంతరం అంతా కలిసికట్టుగా యువత పోరు కార్యక్రమానికి తరలి వెళ్దామన్నారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు డి.వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షుడు హెచ్.వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా, నియోజకవర్గం వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు ఎస్.సత్యం, టి.ఫాల్గుణరావు, ఎస్.వినోద్, చిన్ని జోగారావు, మురళీరెడ్డి, ఎ.రాహుల్, బి.రాజేష్, ఎన్.నరేష్, యు.తమ్మయ్య, ఎం.శంకర్, బి.కార్తీక్, పి.మోహన్, హెచ్.గోవిందరావు, బి.గోపాలరావు, టి.రాజు, తిరుమలరెడ్డి, లోకేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కె.గిరి, ఎ.వెంకటేష్, కె.శ్రీధర్ ఉన్నారు.

యువత పోరు విజయవంతం చేయాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ఈ నెల 12న నిర్వహిస్తున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు పిలుపునిచ్చారు. సోంపేటలో పార్టీ నాయకులతో కలిసి యువతపోరు వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను, నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన నిధులు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుకుంటుందన్నారు. భృతి అందజేస్తామని నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. గత వైఎస్సార్‌కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించడానికి ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణకు ప్రయత్నించడం దారుణమన్నారు. నిరుద్యోగులు, విద్యార్థుల పక్షాన వైఎస్సార్‌సీపీ నిలబడి కూటమి ప్రభుత్వంపై నిరసన గళం వినిపించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగ యువత స్వచ్ఛందంగా పాల్గొని నిరసన తెలియజేయాలని కోరారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, పార్టీ నాయకులు తడక జోగారావు, బతకల మోహనరావు, కె.నారాయణ, ధర్మారావు, సతీష్, ఢిల్లీరావు, భీమారావు ఉన్నారు.

మహిళలకు సన్మానం



గీతారాణి, వందనను సత్కరిస్తున్న దృశ్యం

పలాస: పలాస రైల్వే యూనియన్ కార్యాలయంలో మహిళ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జిల్లా అధ్యక్షురాలుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన చాపర గీతారాణి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పని చేస్తూ మూఢ నమ్మకాల నిర్మూలనకు ఎంతో కృషి చేస్తున్న తెంబ వందనను సత్కరించారు. మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎం.ఎన్.ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి కోదండరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కుత్తుం లోకనాథం, అధికార ప్రతినిధి సార సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు బట్టు, ప్రేమచంద్, బోకర దుర్యోధన, పిట్ట జోగారావు ఉన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేత



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కవిటి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో తండ్రి లేక తల్లి మాత్రమే ఉన్న పలువురికి గాయిత్రీ పరివార్ సంస్థ ఆర్థికసాయం చేయడం అభినందనీయమని రాజపురం బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివరాంప్రసాద్ పాఢి అన్నారు. కన్నుపుట్టుగ కేంద్రంగా పనిచేస్తున్న గాయత్రీ పరివార్ సంస్థ ప్రతినిధులు బొర్ర ప్రకాశరావు, దేవేంద్రరాణో, కె.మనోజ్ తదితరులు ఈ మేరకు నలుగురు విద్యార్థులకు రూ. ఐదు వేలు చొప్పున 20 వేల రూపాయలను సోమవారం అందజేశారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో పూడికల తొలగింపు

ఇచ్ఛాపురం టౌన్: పట్టణంలోని బంగ్లారోడ్డు పరిధిలో ఉన్న కాలువల్లో పేరుకుపోయిన పూడికలను సోమవారం తొలగించారు. పనులను మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్ పరిశీలించారు.

ఆర్థిక సాయం



ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామానికి చెందిన కరుణాకర్ బెహరా రోడ్డు ప్రమాదంలో గాయపడి బరంపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శస్త్ర చికిత్సకు డబ్బు లేక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన యువకులు రూ. పదివేలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడి భార్య కోమలికి సోమవారం అందజేశారు. యూత్ సభ్యులు హంగీర్ బెహరా, రాముా బెహరా, సాగర్ బెహరా, దుదిష్టీ బెహరా ఉన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

ఆలయ వార్షికోత్సవం



నందిగాం మండల కేంద్రంలోని ఉమా అగస్త్యేశ్వరస్వామి ఆలయ ఏడవ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామపురోహితులు రేజేటి బోసు బాబు, మేడేపల్లి రమేష్‌శర్మల ఆధ్వర్యంలో 11 మంది దంపతులచే ఏకవారిభిషేక రుద్రాభిషేకం, రుద్రహోమం, విశేష ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకం, శీర్షాభిషేకం, స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

–నందిగాం

సావిత్రిబాయి పూలేకు నివాళి



కంచిలి మండల విద్యా వనరుల కేంద్రం వద్ద మహిళా విద్యకు కృషి చేసిన సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

–కంచిలి

కదంతొక్కిన అంగన్‌వాడీలు



టెక్కలి: ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది లోపలకు వెళ్లకుండా గేటు వద్ద మోహరించిన పోలీసులు



ఇచ్ఛాపురం రూరల్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్యకర్తలు, హెల్పర్లు



పలాస: ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

టెక్కలి: సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం కదంతొక్కారు. డివిజన్ కేంద్రమైన టెక్కలి ఆర్డీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు నిర్వహించిన నిరసన కార్యక్రమానికి పోలీసులు భారీగా మోహరించారు. డివిజన్ పరిధిలో వివిధ ప్రాజెక్టుల నుంచి పెద్ద ఎత్తున అంగన్‌వాడీ సిబ్బంది హాజరై తమ డిమాండ్ల పరిష్కారం కోసం నినాదాలు చేశారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సహాయకులకు పదోన్నతులు కల్పించాలని, అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అందజేయాలని, సర్వీసులో ఉంటూ మృతి చెందిన అంగన్‌వాడీలకు మట్టి ఖర్చులతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, టీఏ, డీఏలు అందజేయాలని, మెనూ చార్జీలు పెంచాలని, ఈకేవైసీ, ఫొటో క్యాప్చరింగ్‌ను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతి పత్రం అందజేశారు. కార్యాలయం బయట బైఠాయించిన అంగన్‌వాడీ కార్యకర్తలను లోపలకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు.

అంగన్వాడీ వేతనాలు పెంచాలి

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం ఐసీడీఎస్ రూరల్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఉప తహసీల్దార్ శ్రీహరి, సీడీపీవో పి.నాగరాణికి అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు హైమావతి, పుణ్య, ద్రాక్షాయణి, విజయ, నాగలక్ష్మి, నరసమ్మ, ఉమా, బాలామణి, జయ ఉన్నారు.

పలాస: పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. గతంలో 42 రోజుల సమ్మెకాలంలో ఇచ్చిన హామీలను సకాలంలో అమలు చేయాల్సి ఉండగా అదిగో ఇదిగో అంటూ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు ఎన్.హైమావతి, బి.సునీత, ఎం.మంజులకుమారి, డి.సునీత, హేమలత, బి.నిర్మల, కె.జ్యోతి, బి.చామంతి, ఇందుమతి, జయలక్ష్మి, అప్పలనరసమ్మ పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ



సోంపేట: బాలకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామారావు



సంతబొమ్మాళి: పరామర్శలో తిలక్ తదితరులు

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన విశ్రాంత విద్యాశాఖాధికారి జన్మెల బాలకృష్ణ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. పలువురు నాయకులు ఉన్నారు.

సంతబొమ్మాళి: నౌపడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కర్రి కృష్ణవేణి కుమారుడు నాగిరెడ్డి ఇటీవల చనిపోయారు. దీంతో ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పరామర్శించారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామమూర్తి, స్థానిక సర్పంచ్ పిలక రవికుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బి.సుధాకర్ ఉన్నారు.